సాక్షి తిరుపతి
గురువారం ׀ 5 ׀ డిసెంబర్ ׀ 2024



ఘంటసాల స్వరం అజరామరం

ఘంటసాల స్వరం అజరామరరం అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు.

- 8లో



నిందితులను అరెస్టు చేయాలి

ప్రొఫెసర్ చెంగయ్యపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని జీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు.

- 8లో



పెద్ద చెరువుకు గండి

శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం పెద్ద చెరువుకు గండి పండింది. దీంతో చెరువులోని నీరంతా వృథా అయ్యింది.

- 8లో

న్యూస్‌రీల్

'వుయ్ రన్ ఫర్ తిరుపతి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో శాప్, ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్‌మెంట్), ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'వీ వైబ్' సంస్థ నిర్వహించే వుయ్ రన్ ఫర్ తిరుపతి కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం వర్సిటీలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 30 నిమిషాలు నడక, పరుగు దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. నగరవాసులు డిసెంబర్ 8 తేదీన జరిగే 10 కే రన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10కే పరుగులో ప్రతిభ చూపి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు దాదాపు రూ.60 వేల ప్రైజ్ మనీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవీణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డీన్ ప్రొఫెసర్, చంద్రశేఖరయ్య, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ దృష్టికి గురుకుల సమస్యలు



మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: గురుకుల పాఠశాలలో సమస్యలు నెలకొన్న విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కనమనంబేడులో ఉన్న ఏకలవ్య మోడ్రన్ ఎస్టీ గురుకుల పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటి పరిష్కారానికి విద్యార్థులు ఆందోళన చేశారని ఎంపీ మద్దిల గురుమూర్తికి తెలిపామన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ మద్దిల గురుమూర్తి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు చదువుకునేందుకు అనువైన వాతావరణం గురుకులంలో కల్పించాలని తెలిపారన్నారు. ఎంపీ ఢిల్లీ నుంచి రాగానే గురుకులాన్ని సందర్శించి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ సత్యవేడు నియోజక వర్గ కన్వీనర్ వేలూరు రాకేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, సర్పంచ్ జనార్దన్, జయచంద్రనాయుడు, వెంటాద్రి, కిరణ్‌యాదవ్, దినకర్, కారణివెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో బుధవారం నుంచి జరుగుతున్న మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి వివిధ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను వీసీ సీహెచ్ అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 62 పరీక్ష కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ గతంలో 25 వేల మంది విద్యార్థు లు డిగ్రీ పరీక్షలకు హాజరయ్యేవారని, ప్రస్తుతం ఆసంఖ్య 12 వేలకు చేరిందని తెలిపారు. దీంతో 80కి పైగా సెంటర్లలో నిర్వహించాల్సి పరీక్షలు విద్యార్థులు తగ్గడంతో 62 సెంటర్లకు పరిమితం చేశామన్నారు.

సూర్యతేజం.. చంద్రవదనం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న పద్మావతీ అమ్మవారు



చంద్రప్రభ వాహనంలో కొలువుదీరిన అమ్మవారు(ఇన్‌సెట్) విశేషాలంకరణలో శ్రీవారి దేవేరి

శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఏడో రోజైన బుధవారం శుభప్రదంగా సాగాయి. అమ్మవారు సూర్య, చంద్రప్రభలపై గోవర్ధనగిరిధారి, కృష్ణుడి అవతారాల్లో భక్తులను అనుగ్రహించారు. ఉత్సాహతరంగణిలా ఉదయం, రాత్రి మాడవీధుల్లో విహరించారు. ఈ వాహనాల దర్శనంతో తేజోమయం.. ఐశ్వర్యం.. సంపూర్ణ ఆరోగ్యం.. సుఖజీవనం వంటి ఉత్తమ ఫలితాలు చేకూరుతాయన్న నమ్మకంతో భక్తజన ప్రవాహం అమ్మను దర్శించుకుంది. భక్తుల కోలాటాలు, సంప్రదాయ భజన బృందాల భజనలు, మంగళ వాయిద్యాలు, జీయ్యర్ స్వాముల ప్రబంధ పారాయణం, కళా ప్రదర్శనలు, నృత్యాలతో మాడ వీధులు కళకళలాడాయి. - చంద్రగిరి

అమ్మకు కోత కష్టం

మారుతున్న కాలం.. అయిన సడలని మూఢ నమ్మకం.. మంచి జాతకం కావాలనుకుంటున్న జనం.. దీనికితోడు కాన్పుకష్టం భరించలేమన్న గర్భిణి భయం.. కాసుల కోసం కక్కుర్తి పడుతున్న ప్రైవేట్ వైద్యం.. వెరసి.. ఆపరేషన్‌పై మొగ్గుచూపుతున్న గర్భిణులు, వారి బంధుగణం.. ఫలితం అమ్మకు కోత కష్టం.. కొని తెచ్చుకుంటున్న అనారోగ్యం.

- రైల్వే కోడూరుకు చెందిన ఓ గర్భిణిని తిరుపతిలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు నవంబర్ 28వ తేదీన తీసుకువచ్చారు. అప్పటి వరకు స్కానింగ్‌తోపాటు అన్ని రిపోర్టులు పక్కాగా ఉన్నా, అక్కడి వైద్యులు కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం మొదలుపెట్టారు. బిడ్డ అడ్డం తిరిగింది. కచ్చితంగా సిజేరియన్ చేయాలి. లేకపోతే తల్లీబిడ్డకు ప్రమాదం అంటూ గందరగోళం సృష్టించారు. చేసేదిలేక ఆస్పత్రి వారు ఇచ్చిన ఫామ్‌పై సంతకం చేసి అంగీకారం తెలిపారు. దీంతో రూ.55 వేలు చెల్లించి ఆ తల్లి కడుపు కోసి, బిడ్డను బయటకు తీసి మళ్లీ కుట్టి ఇంటికి పంపించారు.
- చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలం దామలచెరువు గ్రామానికి చెందిన ఓ గర్భిణికి నాలుగేళ్ల క్రితం తిరుపతిలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో సిజేరియన్ చేశారు. మరుసటి ఏడాది కూడా రెండో సారి గర్భం దాల్చినప్పుడు కొందరి సూచనల మేరకు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకువచ్చారు. మొదటి బిడ్డకు సిజేరియన్ చేయడంతో కొన్ని సమస్యలు తలెత్తడంతో రెండో కాన్పుకు కూడా కచ్చితంగా సిజేరియన్ చేయాల్సి వచ్చింది. రెండుసార్లు సిజేరియన్ కావడంతో ప్రస్తుతం ఆ తల్లి వివిధ గైనిక్ సమస్యలతో ఇబ్బంది పడుతోంది. కడుపు కూడా సాధారణం కంటే రెండింతలు ఎత్తుగా ఉండడంతో మానసికంగా కూడా ఇబ్బంది పడుతోంది. ఈ స్థితి వీరిద్దరిదే కాదు. ఇలాంటివి తిరుపతి జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయి.



ప్రసవానికి ఆపరేషాన్

- గర్భిణులకు తప్పని కడుపు కోతలు
- ముహూర్తాల మోజులో తల్లిదండ్రులు
- కాసుల కోసం తెగబడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- రోజురోజుకూ పెరుగుతున్న సిజేరియన్లు
- నార్మల్ డెలివరీనే తల్లి బిడ్డకు శ్రేయస్కరమంటున్న వైద్యనిపుణులు

తిరుపతి తుడా: శుభ ముహూర్తాలు, మంచి ఘడియలు, నక్షత్రాలు, తిథిలు పేరిట యథేచ్ఛగా కడుపు కోతలు జరుగుతున్నాయి. ఉన్నతంగా చదువుకున్నవారు సైతం జననాలకు జాతకాలను ముడిపెడుతున్నారు. తల్లి గర్భం నుంచి దైవేచ్ఛతో..స్వేచ్ఛగా బయట రావాల్సిన బిడ్డలను ముంచి ముహూర్తాల పిచ్చిలో ఆపరేషన్లు చేయించి, తల్లుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మనుషుల్లోని మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి తెర తీస్తున్నారు. బిడ్డకు జన్మనివ్వడానికి మంచి రోజు, నక్షత్రం, ముహూర్తం చూసుకుంటున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగిపోయింది. చాలా మంది దంపతులు, వారి కుటుంసభ్యులు పురోహితుల వద్దకు వెళ్లి ప్రసవాలకు ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఫలానా రోజు... ఫలానా సమయం బాగుందని నిర్ణయించిన తర్వాత డాక్టర్లను కలిసి అదే సమయానికి ఆపరేషన్ చేయాలని కోరుతున్నారు. సుఖ ప్రసవానికి ఆస్కారం ఉన్నా.. సిజేరియన్ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వైద్యులు సైతం అసలు డెలివరీ కావాల్సిన సమయానికి ముందుగానే ఆపరేషన్ చేసి, బిడ్డను చేతిలో పెడుతున్నారు.

సాధారణ కాన్పు క్షేమం

సాధారణ కాన్పులు తల్లీబిడ్డకు క్షేమం. నాలుగైదు గంటలు పురిటి నొప్పులు భరించాల్సి వచ్చినా భవిష్యత్తులో చాలా అనారోగ్య సమస్యలు తప్పుతాయి. సాధారణ ప్రసవంతో రక్తస్రావం తక్కువగా ఉంటుంది. తొలిసారి సహజ ప్రసవం అయితే రెండోసారి కూడా సుఖ ప్రసవం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాన్పు జరిగిన మూడు నాలుగు రోజుల నుంచే తల్లి అన్ని పనులు చేసుకునే వీలుంటుంది. బిడ్డ పుట్టిన గంటలోగా ముర్రుపాలు తాగించే అవకాశం ఉంటుంది. శిశువుకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువ. పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి. అందుకే పాతతరం వారు సహజ ప్రసవాలపైనే మొగ్గు చూపేవారు.

అనర్థాలని తెలిసినా..

అవసరం లేకపోయినా ఆపరేషన్ చేస్తే తల్లీబిడ్డ ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. శస్త్రచికిత్సకు కేవలం గంట సమయమే అయినా భవిష్యత్‌లో తల్లి పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆపరేషన్ సమయంలో శరీరంలోని నాలుగైదు లేయర్లు కోయాల్సి ఉంటుంది. గర్భాశయం నుంచి బిడ్డను బయటకు తీసిన సమయంలో తీవ్ర రక్తస్రావం అవుతుంది. డెలివరీ తర్వాత కనీసం నెలలపాటు తల్లికి విశ్రాంతి అవసరమవుతుంది. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. తగిన పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా హెర్నియా, కడుపునొప్పి, వెన్నునొప్పి తదితర సమస్యలు వస్తాయి. సిజేరియన్ చేసుకున్న ప్రతి తల్లికి శాశ్వతంగా కడుపు ఎత్తుగానే ఉంటుంది. అలానే సిజేరియన్‌తో పుట్టిన బిడ్డ ఎదుగుదలతో లోపాలు తలెత్తుతాయి. ఊపిరితిత్తుల సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

జిల్లాలో ప్రసవాల సమాచారం

ప్రభుత్వాస్పత్రుల్లో..

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జూన్	842	347	1,189
జూలై	790	366	1,156
ఆగస్టు	877	418	1,295
సెప్టెంబర్	880	428	1,308
అక్టోబర్	883	454	1,337
నవంబర్	793	389	1,182

ప్రైవేటు ఆస్పత్రుల్లో..

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జూన్	738	725	1,463
జూలై	774	724	1,498
ఆగస్టు	633	899	1,532
సెప్టెంబర్	664	851	1,515
అక్టోబర్	571	818	1,389
నవంబర్	586	801	1,387



సిజేరియన్ చేయాల్సిన సందర్భాలివీ..

- బిడ్డ ఎదురుకాళ్లతో ఉంటే సిజేరియన్ చేయాల్సి వస్తుంది.
- శిశువు బయటకు వచ్చేదారి చాలా సన్నగా (కాంట్రాక్టెడ్ పెల్విస్) ఉంటే మాత్రం ఆపరేషన్ తప్పనిసరి. సాధారణంగా తల్లుల ఎత్తు 185 సెంటీమీటర్ల కంటే తక్కువ ఉన్నవారికి బిడ్డ బయటకు వచ్చే దారి సన్నగా ఉండే అవకాశం ఎక్కువ. అలాంటి సమయంలో సిజేరియన్ అవసరం అవుతుంది.
- కడుపులోని శిశువు బరువు పెరగడం, బిడ్డ అడ్డం తిరగడం, ఉమ్మనీరు తక్కువ ఉన్నప్పుడు, బిడ్డ ఉమ్మనీరు తాగినప్పుడు తల్లికి బీపీ, షుగర్ అధికంగా ఉన్నప్పుడు, కవలలు, ముగ్గురు పిల్లలు జన్మించే సమయంలో సిజేరియన్ చేయాల్సివస్తుంది.

వారికి మూఢ నమ్మకం..వీరికి కాసుల వర్షం

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా చేయడం లేదు. సాధారణ ప్రసవం చేస్తే తక్కువ ఫీజు వస్తుందని, సిజేరియన్ అయితే ఎక్కువ సొమ్ము వసూలు చేయవచ్చని కొందరు వైద్యులు ఆపరేషన్‌కే మొగ్గు చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. గర్భిణుల కుటుంబసభ్యులు సైతం ఆస్పత్రి స్థాయి మేరకు ప్రసవానికి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ప్యాకేజీలు మాట్లాడుకుని చేయిస్తున్నారు. అలాగే ముహూర్తం నిర్ణయించుకుని ఆ సమయానికే సిజేరియన్ చేయాల్సివస్తే ఆస్పత్రుల వారు అదనంగా వసూలు చేస్తున్నారు. అనవసర ఆపరేషన్ల కారణంగా తల్లీబిడ్డలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ కొందరు ముహూర్తాల మోజులో సిజేరియన్ వైపు ఆసక్తి చూపుతున్నారు. ఓ వైపు మూఢనమ్మకాలు, మరో వైపు ప్రైవేట్ ఆస్పత్రులకాసుల కక్కుర్తితో సిజేరియన్ల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది.


ఆపరేషన్లను ప్రోత్సహిస్తే చర్యలు



ఆపరేషన్లను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు. సుఖ ప్రసవం చేస్తే తల్లీబిడ్డకు ఎంతో మంచిది. తల్లీబిడ్డల ఆరోగ్యం బాగుంటుంది. సిజేరియన్లతో పలు నష్టాలు ఉన్నాయి. ఈ అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. సిజేరియన్లను ప్రోత్సహించే ఆస్పత్రులపైనా చర్యలు తప్పవు.

-డాక్టర్ యు. శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

సహజ కాన్పులకే ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రభుత్వాస్పత్రుల తరహాలో ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ సహజ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తల్లి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయా కుటుంబ సభ్యులు సైతం సహజ ప్రసవం వైపు మొగ్గు చూపాలి. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో 80 శాతం మేర సహజ ప్రసవాలే జరుగుతున్నాయి. తల్లీబిడ్డ ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలి.

– డాక్టర్ పార్థసారథిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, తిరుపతి

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- జనవరి 8 వరకు కొనసాగింపు
- రెవెన్యూ సదస్సుల సమన్వయ అధికారిగా జేసీ
- నోడల్ అధికారులుగా జిల్లా ఆఫీసర్లు
- ఆర్డీఓల పర్యవేక్షణలో సదస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,051 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగించాలని సూచించారు. జేసీ సమన్వయ అధికారిగా ఉంటారని చెప్పారు. జిల్లా అధికారులు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఆర్డీఓ పర్యవేక్షణ చేయాల్సి ఉందని చెప్పారు. తహసీల్దార్లు సదస్సులకు ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో 55శాతం సమస్యలు రెవెన్యూకు చెందినవే వస్తున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఫ్రీహోల్డ్, 22ఏ జాబితాకు చెందిన సమస్యలతోపాటు మ్యుటేషన్, పలు సర్టిఫికెట్ల జారీ తదితర అన్నింటికీ పరిష్కారం చూపాలని చెప్పారు. సర్టిఫికెట్లు తీసుకునే వారు రెవెన్యూ సదస్సులో మాత్రం ప్రభుత్వానికి కట్టాల్సిన నగదు అవసరం లేదని తెలిపారు. ఉదయం 9గంటల నుంచే రెవెన్యూ సదస్సులు ప్రారంభం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి, ఆర్డీఓలు రాఘవేంద్ర మీనా, రామమోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, కలెక్టరేట్ ఏఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

13న చొక్కాణి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ చొక్కాణి నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదలలో తెలిపారు. ఆలయంలో ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శివయ్యను అగ్నితో పూజించే విధానం ఉందని తెలిపారు. అందుకు నిదర్శనమే చొక్కాణి ఉత్సవమని తెలిపారు. ఇక 15వ తేదీ పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న వేయిలింగాల కోనలో ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. 15న ఆదిరవారం పౌర్ణమి సందర్భంగా బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు శిష్య బృందం శ్రీగురువాణి సొసైటీకి చెందిన సుమారు 200 మంది గిరిప్రదక్షిణలో పాల్గొంటారని తెలిపారు.

ఎన్ఏ సర్వే పరిశీలన



తిరుచానూరులో ఎన్ఏ సర్వే పరీక్షను పరిశీలిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను బుధవారం పాఠశాల విద్య కడప ఆర్జేడీ ఎ.శామ్యూల్ పరిశీలించారు. తిరుపతి సత్యనారాయణపురం, తిరుచానూరు జెడ్పీ హైస్కూళ్లల్లో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రశ్న పత్రాలకు సంబంధించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, చదవడం, రాయడం వంటి నైపుణ్యాల పరిశీలనకు దేశ వ్యాప్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షను 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించి, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. లోటుపాట్లను గుర్తించి మరింతగా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగుపరిచేందుకు ఈ పరీక్షను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కేవీఎన్.కుమార్, తిరుపతి డీవైఈఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పది పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి



ఉపాధ్యాయులతో సమావేశమైన ఆర్జేడీ శామ్యూల్

రామచంద్రాపురం: పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. బుధవారం మండలంలోని కేకేవీ పురం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న సమ్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. ఈ నెల 7వ తేదీన చేపట్టనున్న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. హెచ్ఎం భాస్కర్, టీచర్లు పాల్గొన్నారు.

షారూఖ్ మృతదేహం లభ్యం



షారూఖ్ మృతదేహం

చిట్టమూరు(చిల్లకూరు): తాగేడు వాగులో గల్లంతైన ఇద్దరు యువకుల్లో ఒకరి మృతదేహం మంగళవారం సాయంత్రం లభ్యం కాగా మరొకరి మృతదేహం బుధవారం లభ్యమైంది. చిట్టమూరు మండలం మల్లాం సమీపంలోని తాగేడు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కోట నుంచి బైక్పై మల్లాంకు వెళుతున్న మధురెడ్డి, షారూఖ్(22) నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మత్స్యశాఖ, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా మృతదేహాల కోసం గాలింపు చేపట్టారు. దీంతో సాయంత్రం మధురెడ్డి మృతదేహం లభ్యం కాగా, రాత్రి చీకటి పడడంతో గాలింపు ఆపివేశారు. ఉదయం మరోసారి గజ ఈ తగాళ్ల ద్వారా మృతదేహం కోసం గాలింపు చే పట్టగా షారూఖ్ మృత దేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు ఝార్ఖండ్ వాసి కావడంతో వారి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హుస్సేన్బాషా తెలిపారు.

33 మందికి జరిమానా

తిరుపతి లీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 33 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

పంచమి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి

- టీటీడీ ఈఓ శ్యామలరావు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం జరుగనున్న పంచమి తీర్థానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు చెప్పారు. అలిపిరి నుంచి శ్రీవారి సారే ఊరేగింపు మార్గాన్ని ఈఓ, తిరుపతి జేఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తదితర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పంచమి తీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారే ఊరేగింపుగా అలిపిరి చేరుకుంటుందన్నారు. అలిపిరి నుంచి కోమలమ్మ సత్రం, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, తిరుచానూరులోని పసుపు మండపం మీదుగా అమ్మవారి ఆలయానికి తీసుకుని వచ్చి, పూజలు నిర్వహిస్తామన్నారు. తరువాత పంచమి తీర్థ మండపానికి వేంచేపు చేసి, అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచమి తీర్థం నిర్వహణకు అవసరమైన ఇంజినీరింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

అమ్మవారి పంచమితీర్థం సందర్భంగా భక్తులు వేచి ఉండేందుకు నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు.



బ్రహ్మోత్సవాల్లో ఆఖరిఘట్టమైన పంచమితీర్థానికి సిద్ధమైన పద్మపుష్కరిణి

రథోత్సవానికి సర్వం సిద్ధం

శ్రీ పద్మావతి అమ్మవారి రథోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. రథాన్ని వివిధ కళాఖండాలు, దేవతామూర్తుల ప్రతిమలు, అశ్వాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

క్యూలలో పుష్కరిణిలోకి ప్రవేశం

పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు, తిరిగి వెళ్లేందుకు గేట్లు, బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పద్మపుష్కరిణిలో ఉదయం 12 గంటలకు చక్రస్నానం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

1200 మందితో భద్రత

పంచమితీర్థం సందర్భంగా 1200 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టిన ట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. అలిపిరి నుంచి తిరుచానూరులోని పసుపు మండపం వరకు శ్రీవారి సారే ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



జర్మన్ షెడ్లను పరిశీలిస్తున్న ఈఓ శ్యామలరావు

శ్రీవారిని దర్శించుకున్న ఉడిపి పీఠాధిపతి



ఉడిపి మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ

తిరుమల: ఉడిపి మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగోన్నతి జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల టీచర్ల ఉద్యోగోన్నతి జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. నగరపాలక, మున్సిపాలిటీల పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా (అన్ని సబ్జెక్టులు) ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించిన జాబితాను డీవైఈవో, ఎంఈవోల మెయిల్స్కు పంపామన్నారు. వాటిని పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో ఈ నెల 7వ తేదీ సాయంత్రంలోపు చిత్తూరు డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని పేర్కొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి



తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్కుమార్, మీడియా కోఆర్డినేటర్ గోళ్ల శశికుమార్ డిమాండ్ చేశారు. ప్రొఫెసర్పై దాడికి నిరసనగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి పూలే విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర జోనల్ కోఆర్డినేటర్ పి గురప్ప, రాష్ట్ర కార్యదర్శులు ప్రభాకర్, వేణుగోపాల్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు సురేంద్రబాబు, కమిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత కాపు బీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఎస్వీయూ దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై బయట వ్యక్తులు వర్సిటీలోకి చొరబడి భౌతిక దాడికి పాల్పడడం దారుణమని ఏపీ దళిత కాపు బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివకాపు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రిజిస్ట్రార్కు వినతిపత్రం సమర్పించారు.

అధ్యాపకునిపై దాడి అమానుషం

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ దళిత అధ్యాపకుడు చెంగయ్యపై దుండగులు దాడి చేయడం అమానుషమని నగర పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బాలాజీ కాలనీ అంబేడ్కర్ భవన్లో తిరుపతి పాస్టర్స్ ఫెలోషిప్, ఇతర పాస్టర్స్ అసోసియేషన్ వేదిక నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ పార్టీ నేత, రిటైర్డ్ జడ్జి గురప్ప, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుల్అరుసు, ముస్లిం నాయకులు రఫీ, దళిత అకాడమీ నాయకులు ధనశేఖర్, పాల్రాజ్, బిషప్ రాజ్కుమార్, మార్టిన్, ప్రభాకర్, అడ్వకేట్ రమేష్, వెంకట్ పాల్గొన్నారు.

భూపతీశ్వర ప్రాజెక్టు ప్రధాన కాలువ గండి



భూపతీశ్వర ప్రాజెక్టు కాలువకు పడిన గండి

నాగలాపురం: మండలంలోని టీపీ కోట గ్రామం వద్ద ఉన్న భూపతీశ్వర ప్రాజెక్టు ప్రధాన కాలువ గండి పడింది. దీంతో 500 ఎకరాలు ఆయుకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్లో ఒక కంపార్ట్మెంట్ నిండింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 60,301 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,222 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

ఘంటసాల స్వరం అజరామరం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి, గుండాల గోపీనాథ్, కళాకారులు

- ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం
- ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు

తిరుపతి కల్చరల్: ఘంటసాల వెంకటేశ్వరరావు స్వరం అజరామరం అని, ఆయన ఆలపించిన భగవద్గీత నేటికీ ప్రతి తెలుగువారింట వినిపిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఘంటసాల జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఆయన విగ్రహానికి ఘంటసాల అభిమానులు స్థానిక రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేసి, పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, బీజేపీ సీనియర్ నాయకులు నవీన్కుమార్రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఘంటసాల భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన పాటల రూపంలో ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల గాన పీఠం విజయకుమార్, ప్రముఖ గాయకులు డాక్టర్ సోము ఉమాపతి, రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు కొట్టే సుబ్రమణ్యం రెడ్డి, చిత్తరపు హనుమంతరావు, పురోహితుడు సురేష్ స్వామి, మల్లారపు రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్స్ వేధింపుల నుంచి కాపాడండి



ఫైనాన్స్ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు

చంద్రగిరి: ఆటో ఫైనాన్స్ వేధింపులు, దౌర్జన్యాల నుంచి తమను కాపాడాలని బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటన బుధవారం చంద్రగిరిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని ముంగళిపట్టు గ్రామానికి చెందిన యమున, తిరుపతి పాస్పోర్టు కార్యాలయానికి ఎదురుగా ఉన్న నవ్య ఆటో ఫైనాన్స్లో రూ.30 వేలు వడ్డీకి తీసుకుంది. కంతుల వారీగా ఇప్పటి వరకు రూ.21,700 చెల్లించింది. అయితే ఇటీవల ఆమె భర్త అనారోగ్యం పాలవడంతో కంతును చెల్లించలేకపోయింది. దీంతో ఫైనాన్స్ కంపెనీ యజమాని దీపారెడ్డి, యమునకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడినట్లు బాధితురాలు తెలిపింది. ఆపై ఫైనాన్స్కు చెందిన కొంత మంది వ్యక్తులను తమ ఇంటి వద్దకు పంపింపించిందని, బలవంతంగా యమున ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారని వాపోయింది. అంతటితో ఆగకుండా గిరిజన మహిళ అని చూడకుండా కులం పేరుతో దూషించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తన కార్యాలయానికి పిలిపించుకుని దౌర్జన్యానికి పాల్పడినట్లు బాధితురాలు వాపోయింది. దీపారెడ్డితో పాటు ఫైనాన్స్ కంపనీకు చెందిన ఆమె అనుచరులు సాయి ప్రకాష్, సంతోష్, యుగంధర్, యమునతో తమకు ప్రాణహాని ఉందని, ఫైనాన్స్ ఆగడాల నుంచి రక్షణ కల్పించాలని సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

తిరుమల: తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద ఉన్న దుకాణాలు, హాకర్ లైసెన్సులను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్సులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దుకాణదారులు తమకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడి భక్తులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి రూ.79.66 లక్షల ఆదాయం

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల్లోని హుండీల కానుకల లెక్కింపులో రూ.79.66 లక్షలు వచ్చిందని డీసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దేవస్థానంలోని క్రేన్ మండపంలో బుధవారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 రోజులకు గాను స్వామివారి హుండీల్లో రూ.79,66,645 వచ్చిందన్నారు. బంగారం 290 గ్రాములు, వెండి 3.5 కిలోలు వచ్చినట్లు చెప్పారు. పలుదేశాల విదేశీ నాణ్యాలు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ ప్రధానర్చకులు సీతారామయ్యస్వామి, జిల్లా దేవాదాయశాఖ ఏసీ జనార్దన్రెడ్డి, ఇన్స్పెక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు గండి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రామాపురం పెద్ద చెరువుకు గండిపడి చెరువు కింద పొలాలను ముంచెత్తింది. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చెరువు కట్ట కు గండి పడడంతో చెరువులోని నీరంతా పొలాల్లో ప్రవహించడంతో ఇసుకమేటలు ఏర్పడ్డాయి. సుమారు 15 ఎకరాల పొలంలో ఇసుక దిమ్మెలుగా ఏర్పడాయి. వరి నాటేందుకు సిద్ధం చేసిన నారుమడి నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. నీటిపారుదల శాఖ అధికారులు చెరువు వద్దకు చేరుకుని జేసీబీతో గండిని పూడ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

జర్మన్ భాషపై తిరుపతిలో శిక్షణ

తిరుపతి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో జర్మన్ భాషపై శిక్షణ, తర్వాత ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నట్టు ఆ విభాగం జిల్లా అధికారి ఆర్.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థతోపాటు ఓఎంసీఏపీ, ఎస్ఎం కేర్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు. జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న వారు, 35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని, ఈ నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 నుంచి ఆరు నెలల పాటు తిరుపతిలోని స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జర్మన్బాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలో శిక్షణ ఇస్తారని వెల్లడించారు. శిక్షణకు ఎంపికైన వారు బయోడేటాతోపాటు సర్టిఫికెట్స్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అదనపు సమాచారం కోసం 9160912690లో సంప్రదించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి అర్బన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రమాదాలను తప్పించడానికి ఇరిగేషన్ విభాగానికి సంబంధించి కిందిస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రధానంగా నిండిన చెరువులు, రిజర్వాయర్లపై నిశితంగా నిఘా పెట్టా లన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్వోలు, సచివా లయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా కేంద్రానికి లేదా డివిజన్ కేంద్రానికి అందించాలని ఆదేశించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ, ప్లేస్మెంట్ ఆఫీసర్ చంద్రయ్య తెలిపారు. చెన్నైకి చెందిన సౌతర్న్ ఇన్ఫోటిక్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సుమారు వందమంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారని పేర్కొన్నారు. వార్షిక వేతనం రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షలతో 14 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఉపాధే లక్ష్యంగా నాణ్యమైన బోధనతో పాటు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామన్నారు. నోడల్ ఆఫీసర్ సుజాత, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ వచ్చిందని బురిడీ

– నగలు, ఏటీఎం కార్డు చోరీ



పోలీసులకు ఘటన వివరాలను తెలుపుతున్న బాధితుడు

పాకాల: ఉచితంగా గ్యాస్ వచ్చిందని వృద్ధుడిని బురిడీ కొట్టించి బంగారు నగలు అపహరించిన సంఘటన పాకాలలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. పాకాల రామానాయుడు కాలనీలో నివాసం ఉంటున్న శంకర్నాయుడు ఇంటి ముందుకు బుధవారం గ్యాస్ డెలివరీ బాయ్ వేషంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. ''పెద్దాయనా.. నీకు ఉచితంగా గ్యాస్ వచ్చింది. ఆటో ఇక్కడి రాదు.. గ్యాస్ బండి వద్దకు వచ్చి గ్యాస్ తీసుకో'' అని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన శంకర్నాయుడు ఇంట్లోకి వెళ్లి బీరువాలోని నగదును తీసుకుని, గ్యాస్ బండి ఉందని నమ్మి వీధి చివరకు వెళ్లాడు. గ్యాస్ కోసం వెళ్లే తొందరలో శంకర్నాయుడు బీరువాకు తాళాలు వేయడం మరచిపోయాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలోని మూడున్నర సవర్ల నల్లపూసల దండ, ఆరు సవర్ల బంగారు గాజులు, 10 గ్రాముల బంగా చైను, మొత్తం 70 గ్రాముల బంగారు నగలు, 10 గ్రాముల వెండి బ్రాస్లెట్తో పాటు ఏటీఎం కార్డులు, బ్యాంకు పాసు బుక్కును అపహరించుకుని, పారిపోయాడు. వీధి చివరకు వెళ్లి వచ్చిన శంకరనాయుడు తెరిచి ఉన్న బీరువాను గమనించి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి తన కుమార్తెకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అనంతరం స్థానిక పోలీసులకు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.